సాక్షి వరంగల్

బుధవారం । 27 । ఆగస్టు । 2025



దేవాదులలో పంపింగ్

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల పరిధిలోని దేవాదుల ఎత్తిపోతల పథకం నుంచి నీటి పంపింగ్ కొనసాగుతోంది. - 10లో▸



విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సూచించారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
28^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో రోజంతా ముసురు, పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పర్యావరణాన్ని కాపాడుకుందాం



న్యూశాయంపేట: మట్టిగణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ సత్యశారద పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో కాలుష్యనియంత్రణ మండలి ఆధ్వర్యంలో రెండువేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కాలుష్యనియంత్రణ మండలి ఈఈ సునిత, ఏఓ విశ్వప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఎస్‌జీటీలకు స్కూల్‌అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ డీఈఓ వాసంతి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో 104 మంది ఎస్‌జీటీలు స్కూల్‌అసిస్టెంట్లుగా పదోన్నతి పొంది పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. ఆయా టీచర్లు విధుల్లో చేరేందుకు 15 రోజుల వరకు సమయం ఉంటుంది.

వరంగల్ జిల్లాలో సీనియారిటీ జాబితా..

వరంగల్ జిల్లాలో ఎస్‌జీటీలకు స్కూల్‌అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించేందుకు సీనియారిటీ జాబితా తయారీలో కొంత ఆలస్యమైంది. ఇప్పటికే 1:3 సీనియారిటీ జాబితా వెల్లడించాక అభ్యంతరాలు స్వీకరించి మంగళవారం సాయంత్రం 1:1 నిష్పత్తిలో జాబితాను డీఈఓ రంగయ్యనాయుడు వెల్లడించారు. జిల్లాలో 82 మంది ఎస్‌జీటీలకు స్కూల్‌అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నారు. మంగళవారం రాత్రి 7–30 గంటల వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియకు అవకాశం ఇవ్వలేదు. వెబ్ ఆప్షన్ల తర్వాత పదోన్నతి ఉత్తర్వులు ఇస్తారు.

న్యాయసేవల క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలి



వరంగల్ లీగల్: రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు న్యాయ సేవల క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలని చీఫ్ జస్టిస్ అపరేష్‌కుమార్‌సింగ్ తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్‌కోషి, న్యాయమూర్తి కె.లక్ష్మణ్‌తో కలిసి ఆయన రాష్ట్ర వ్యాప్తంగా 8 జిల్లాల్లో న్యాయ సేవల క్లినిక్‌లను సైనిక్ వెల్ఫేర్ ఆఫీసుల్లో మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. హనుమకొండ వడ్డేపల్లిలోని సైనిక్ వెల్ఫేర్ ఆఫీస్ నుంచి హాజరైన వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు వీబీ నిర్మలా గీతాంబ, డాక్టర్ పట్టాభి రామారావు మాట్లాడుతూ న్యాయ సేవల క్లినిక్‌లో శిక్షణ పొందిన ప్యానల్ న్యాయవాది, పారాలీగల్ వలంటీర్లు ఇందిరా వైశాలి, వై.హనుకాంత్ సేవలందిస్తారని తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యశ్రీ, న్యాయమూర్తులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

పెండింగ్ ఉండొద్దు



రాయపర్తి: భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. మంగళవారం మండలకేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి పెండింగ్ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిట్ ఉన్నతిలో భాగస్వాములు కావాలి

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌ను అన్ని రంగాల్లో అగ్రభాగంలో నిలుపుతూ, ప్రపంచ స్థాయిలో కీర్తి ప్రతిష్టలను నిలిపే భాగస్వాములుగా విద్యార్థులు నిలవాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్‌లో ప్రవేశం పొందిన యూజీ 1,245 మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నిట్ వరంగల్ ఆడిటోరియంలో మంగళవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. నిట్ డైరెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని 'సాంకేతిక విద్యకు మణిహారంగా నిలుస్తున్న నిట్ వరంగల్‌కు స్వాగతం' అంటూ విద్యార్థులను ఆహ్వానించారు.

గణ ఆగమనం!

గణేశ్ విగ్రహాల తరలింపులో నయా ట్రెండ్ కనిపిస్తోంది. గతంలో అక్కడక్కడా కనిపించిన కల్చర్ ఇప్పుడు అంతటికీ పాకింది. నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో కొనుగోలు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాల తరలింపును వేడుకలా చేస్తున్నారు. డీజే చప్పుళ్లు, బాణసంచా పేలుళ్ల మధ్య.. డ్రెస్ కోడ్ పాటిస్తూ ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ గణేశ్ విగ్రహాలను మండపాల వద్దకు తీసుకెళ్తున్నారు. నిమజ్జన వేడుకల్లో కనిపించే సందడి గణనాథుడి ఆగమనం వేళ కనిపించడం విశేషం.





నిమజ్జన సందడి మాదిరిగానే గణేశుడి స్వాగత వేడుక

- సంగీతం, నృత్యం, బాణాసంచా పేలుళ్లతో విగ్రహాల తరలింపు
- డ్రెస్ కోడ్, డీజే చప్పుళ్ల మధ్య మండపాల వద్దకు..
- గ్రేటర్ వరంగల్, పట్టణాల్లో నయా ట్రెండ్
- నేడు కొలువుదీరనున్న గణపయ్య

సాక్షి, వరంగల్: గ్రేటర్ వరంగల్‌తో పాటు జిల్లావ్యాప్తంగా వినాయకచవితి పండుగ సందడి మొదలైంది. వివిధ రూపాల్లో రూపుదిద్దుకున్న బొజ్జ గణపయ్య ప్రతిమలను పట్టణాలు, పల్లెల్లోకి తీసుకెళుతున్నారు. ప్రతిఏటా గణేశ్ నిమజ్జన వేడుకల్లో కనబడే సందడి ఈసారి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించడానికి ముందే కనబడుతోంది. గణేశ ఆగమన వేడుకల నిర్వహణతో భక్తులు గణనాథున్ని ఘనంగా మండపాలకు తీసుకెళుతున్నారు. వినాయక విగ్రహాలను తయారీదారుల నుంచి తాము ఏర్పాటుచేసిన మండపాల వద్దకు డప్పుచప్పుళ్లతో వేడుకగా తీసుకొస్తున్నారు. మహిళలు సంప్రదాయ హారతులతో స్వాగతిస్తుండగా, సంగీతం, నృత్యం, బాణాసంచా పేలుళ్లతో గణనాథుడిని వైభవంగా మండపాలకు తరలిస్తున్నారు. నిమజ్జన సందడికి ఏమాత్రం తీసిపోకుండా ఈసారి సరికొత్త సంప్రదాయంతో వినాయకుడి విగ్రహాలను తీసుకెళ్తుండడం గ్రేటర్ వరంగల్‌లో ఆకట్టుకుంటోంది. సామాజిక మాధ్యమాలు విస్తృతం కావడంతో ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో లైక్స్ కోసం కూడా కొంతమంది వినాయక ఆగమనమాన్ని వేడుకగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల నుంచే నగరంలో చాలా మంది గణనాథులను 'గణేశ్ అగమనం' వేడుకలతో మండపాలకు తీసుకెళ్తున్నారు. మహిళలు, పురుషులు ప్రత్యేక డ్రెస్ కోడ్‌లతో ఈ ఉత్సవానికి వన్నె తెస్తున్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేటలో ఈ గణేశ్ అగమన యాత్రల సందడి జోరుగా ఉంది. బుధవారం నుంచి తొమ్మిదిరోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

మహాగణపతి.. గోమయ గణపతి

- మట్టి, గోమయ విగ్రహాలకే జై కొడుతున్న భక్తులు
- ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాల నిర్వహణ
- పర్యావరణానికి హాని కలగని విధంగా పూజలు

- 10లో▸



వరంగల్ చౌరస్తాలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


సందడే సందడి..



ఎంజీఎం సెంటర్‌లో గణేశ్ విగ్రహాన్ని కొనుగోలు చేసి తీసుకెళ్తున్న యువకులు

ఎంజీఎం సర్కిల్, రామన్నపేట, ఎంజీఎం సెంటర్, ఫోర్ట్ వరంగల్ ఏఎస్ఎం కాలేజీ సమీపంలో, నాగమయ్య గుడి సమీపంలో, నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో, ఎనుమాముల మార్కెట్ రోడ్డు, కోటిలింగాల గుడి సమీపంలో, లేబర్ కాలనీ, ధర్మారం తదితర ప్రాంతాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయకులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. చిన్న విగ్రహాల నుంచి పెద్ద విగ్రహాల వరకు రూ.500ల నుంచి రూ.లక్షల వరకు ఖరీదు చేస్తున్నారు. 'ఈసారి పంచాయతీ ఎన్నికలు సమీపంలో ఉండడంతో చాలామంది విగ్రహ దాతలు ముందుకు వచ్చారు. గతం కంటే ఈసారి ఎక్కువ ఎత్తున్న వినాయక విగ్రహాలను తీసుకెళ్లేందుకు పోటీపడ్డారు. రేటు ఎక్కువైనా ఎక్కడా వెనుకాడడం లేదు' అని ఎంజీఎం సెంటర్‌లో విగ్రహాల విక్రయదారులు అంటున్నారు. మట్టి గణపతి విగ్రహాలను కూడా ఈసారి ఆర్డర్‌పై తీసుకున్నవారు కూడా పదుల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదంతో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ), తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలితో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయకుడి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. మట్టివాడలోని ఎల్లంబజార్‌లో 45 అడుగుల మహా 'విజయగణపతి' విగ్రహం ఆకట్టుకుంటోంది.

వృక్షరూప గణపయ్య



హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో కొలువుదీరడానికి సిద్ధంగా ఉన్న వృక్షరూప గణనాథుడు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ పరిధి గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్(కొత్త బీట్ బజార్)లో ఈసారి పర్యావరణ హితం కోరే గణపతి విగ్రహాన్ని నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేస్తున్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే విషయాన్ని ప్రచారంలోకి తేవడానికి స్థానిక వ్యాపారులు సిద్ధం అవుతున్నారు. వినాయకుడి విగ్రహం తలపై భాగంలో వృక్షం ఆకృతితో పచ్చని చెట్టు కొమ్మలతో పాటు స్వామివారి కాళ్లకు ఏర్లు వేళ్లానుకుని దర్శనమిస్తోంది. ఈ విగ్రహాన్ని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలో శివ అనే వ్యక్తి పలువురు కార్మికుల సహకారంతో రూపొందించారని కాంప్లెక్ అధ్యక్షుడు తోట జగన్నాధం తెలిపారు.

30 ఏళ్లుగా మట్టిగణపతి!



కాకతీయ బ్రిలియంట్ స్టార్ హైస్కూల్‌లో ప్రతిష్ఠించిన మట్టి వినాయక విగ్రహం(ఫైల్)

నల్లబెల్లి: వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సహ కమిటీ నిర్వహకులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల ఏర్పాటును తగ్గించి మట్టివిగ్రహాలను ప్రతిష్ఠించాలని ప్రభుత్వం కొన్ని ఏళ్లుగా విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఇందులోభాగంగా మండలంలోని రుద్రగూడెం కాకతయ బ్రిలియంట్ స్టార్ హైస్కూల్ యాజమాన్యం 30 ఏళ్లుగా కృషి చేస్తోంది. స్థానికులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

గణేశ్..ఆపరేషన్ సిందూర్



శ్రీరామోజు జయకుమార్



ఆపరేషన్ సింధూర్ గణపతి

నర్సంపేట: నర్సంపేట పట్టణానికి చెందిన మైక్రోఆర్టిస్ట్, జాతీయ అవార్డు గ్రహీత శ్రీరామోజు జయకుమార్ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులనే పూజించాలంటూ గత 17సంవత్సరాలుగా విభిన్నమైన సూక్ష్మ గణపతులను తయారుచేసి ప్రజలను జాగృతం చేస్తున్నారు. ఈ సంవత్సరం రెండు అంగుళాల కన్న తక్కువ పరిమాణంలో 'ఆపరేషన్ సిందూర్' గణపతిని మట్టితో చేసి వాటర్ కలర్స్‌తో తీర్చిదిద్దారు.

జనహిత పేరుతో కొత్తడ్రామా

- ఏ ఒక్క హామీ అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గంట రవికుమార్

వర్ధన్నపేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త డ్రామాకు తెర తీసిందని, ఏ ఒక్క హామీ అమలు చేయని కాంగ్రెస్ ఇప్పుడు జనహిత కార్యక్రమం పేరుతో పర్యటించడం విడ్డూరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. మంగళవారం పట్టణకేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజల్ని మోసం చేసి గద్దె ఎక్కిన సీఎం రేవంత్‌రెడ్డి, హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. వరంగల్ రెండో రాజధాని అంటూనే కనీస నిధులు విడుదల చేయకుండా ప్రజల్ని మాయచేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. దమ్ముంటే తక్షణమే 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీశ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం, జిల్లా కార్యదర్శి జడ సతీశ్, అధికార ప్రతినిధి మహేందర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రాయబారపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి, దొమ్మాటి

సంగెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి సత్తా చాటాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కుంటపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నుంచి కడమంచి రమేశ్, రవి, పర్వతం భీములు, యాకయ్య, రాజు బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అనుముల రాజు, నర్సయ్యలతో పాటుగా 60 మంది పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్యతో కలిసి ప్రకాశ్‌రెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ.. కొత్తపాత అనే తేడా లేకుండా సమన్వయంతో స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, నాయకులు నాగరాజు, జగన్నాథచారి, అంజన్‌రావు, ప్రతాప్‌రెడ్డి, స్వామి, రాజు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యూరియా కుంభకోణం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో యూరియా కుంభకోణానికి పాల్పడుతోందని, మార్కెట్ ధర కంటే అధిక ధరకు నానోయూరియా అమ్ముతూ రైతులను దోచుకుంటోందని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు రైతుల సమస్యలు విస్మరించి రాజకీయ యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. యూరియా అడిగిన రైతులపై పిడిగుద్దులతో కాంగ్రెస్ దండయాత్ర చేస్తోందన్నారు. యూరియా కొరతపై ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఎందుకు నిలదీయడం లేదని, యూరియా కొరతపై కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉన్న ఒప్పందం ఏంటని ప్రశ్నించారు. 420హామీలతో మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

కాళేశ్వరంలో గణపతి పూజా కార్యక్రమాలు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో(నేడు)బుధవారం వినాయక చవితి పండుగ సందర్భంగా ఉదయం 10.30 గంటలకు ప్రధాన ఆలయ మండపంలో గణపతి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 5న శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి త్రివేణి సంగమం గోదావరికి ఊరేగింపుగా వెళ్లి గణపతి ప్రతిమను నిమజ్జనం చేయనున్నట్లు ఈఓ పేర్కొన్నారు. భక్తుల పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- ఎంజీఎంలో ఆకస్మిక తనిఖీ



ఎంజీఎంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద వైద్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఎంజీఎం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగం డాక్టర్లు, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎంజీఎంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రోగుల సౌకర్యార్థం ఆస్పత్రిలో వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి అన్ని విభాగాలు, వార్డుల వద్ద ప్రదర్శించాలని సూచించారు. అప్పటి వరకు కలెక్టరేట్ టోల్ ఫ్రీనంబర్ 1800 425 3424ను సంప్రదించి వైద్యం, చికిత్సకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది అందరూ ఎఫ్ఆర్‌సీ ద్వారానే హాజరు వేయాలన్నారు. ఆస్పత్రిలో అన్ని విభాగాల వద్ద ఏర్పాటు చేసిన 20 ఫిర్యాదుల పెట్టెలను డాక్టర్ల సమక్షంలో తెరిచి సమస్యలు లేకుండా చూడాలని, డబ్బులు అడిగిన సెక్యూరిటీ గార్డులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రి వర్క్‌షాప్ ప్రాంతంలో ప్రైవేట్ దుకాణాల వెండింగ్ జోన్ పనులను కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో ఎంజీఎం పర్యవేక్షకులు డాక్టర్ కిశోర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ మురళి, ఆర్ఎంఓలు అశ్విన్‌కుమార్, శశికుమార్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

రోగి సహాయ సేవలు ప్రారంభం

ఎంజీఎంలో హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగి సహాయ సేవలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహాయ సేవల కోసం శిక్షణ పొందిన ఏడుగురు కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లను నియమించామని ఆమె తెలిపారు. శస్త్రచికిత్స, ఈసీజీ, ఎంఆర్ఐ, ఎక్స్‌రే, యూఎస్జీ స్కాన్లు, సీటీ స్కాన్ వంటి వివిధ విభాగాలకు రెఫరల్స్, ట్రాన్స్‌ఫర్లు, డిశ్చార్జ్ అయిన రోగులు హాస్పిటల్ పరిధి నుంచి బయటికి వెళ్లే వరకు అవసరమైన సాయం చేస్తారని వివరించారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధి ముజ్తబా హసన్ అస్కారి మాట్లాడుతూ సేవలతో రోగులకు త్వరితగతిన వైద్య సేవలు అందుతాయని తెలిపారు.

కేఎంసీ ప్రిన్సిపాల్ చాంబర్ ముట్టడి



కేఎంసీ ప్రిన్సిపాల్ చాంబర్ ముట్టడించి నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఎంజీఎం: కాకతీయ వైద్య కళాశాల మెన్స్, ఉమెన్స్ హాస్టల్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని 15 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో మంగళవారం కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎదుట కూర్చొని నినాదాలు చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదా నాయక్ మాట్లాడుతూ.. కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే వేతనాలు బకాయిగా ఉన్నాయని, అధికారులు చేసిన తప్పులకి కార్మికులు బలవుతున్నారన్నారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ – హెల్త్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, కార్మికులు అల్లం రమేశ్, రాణి, రాజకుమారి, అతిక్, రాము, మంద కవిత, రవిబాబు, యాకయ్య, సునీత, జ్యోతి, ప్రకాశ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముసురేసింది

- జిల్లాలో 15.5మిల్లీ మీటర్ల వర్షపాతం
- వర్షాలతో జాలువారుతున్న పత్తిపంటలు



ఖాదర్‌పేట, జల్లి గ్రామ శివారుల్లో పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

నర్సంపేట: జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి ముసురు కమ్మేసింది. పత్తి చేలల్లో నీరు నిలవడంతో కాత, పూత దశలో ఉన్న పంటకు నష్టం వాటిల్లనున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 15.5మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. లక్షా 27వేల ఎకరాల్లో పత్తి సాగు కాగా పంటలో నిలిచిన నీటితో పంట ఎర్రబారడంతో పాటు పూత రాలిపోయే అవకాశం ఉంది.

హామీలు అమలుచేయాలి

- ఉద్యమకారుల పోస్టుకార్డు ఉద్యమం



పోస్ట్‌కార్డు ఉద్యమం చేస్తున్న ఉద్యమకారులు

రాయపర్తి: ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని పోస్టాఫీస్‌లో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ 2023లో ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని రాహుల్‌గాంధీకి పోస్టు కార్డులు పంపారు. ఉద్యమకారులకు ఇంటిస్థలం, 25వేల పెన్షన్, పదివేల కోట్లతో సంక్షేమనిధి ఏర్పాటు, ప్రజాపథకాలలో 20శాతం వాటా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎనగందుల శ్యామ్‌సుందర్, రెడ్డి సంధ్యారెడ్డి, పూలమ్మ, చల్ల వెంకన్న, కొడగాని రాజీరు, సుదగాని వెంకటేశ్వర్లు, తాళ్ల మల్లయ్య, కొత్త సంపత్‌రెడ్డి, జలగం రమేశ్, అన్నపురం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుడిని సురక్షితంగా తీసుకొచ్చిన అధికారులు


అబ్రార్ కోసం వెతుకుతున్న అటవీశాఖ అధికారులు

వెంకటాపురం(కె): మండలంలోని వీరభద్రవరం గ్రామ సమీపంలోని ముత్యం ధార జలపాతం సందర్శనకు వెళ్లి అటవీ ప్రాంతంలో చిక్కుకున్న పర్యాటకుడిని అటవీశాఖ అధికారులు సురక్షితంగా తీసుకొచ్చారు. వరంగల్‌కు చెందిన అబ్రార్ సోమవారం బొగత జలపాతం సందర్శనకు వెళ్లాడు. తిరిగొచ్చే క్రమంలో కాలుకు గాయం కావడంతో నడవలేక అటవీ ప్రాంతంలోనే చిక్కుకున్నాడు. దీంతో రాత్రి డయల్ 100కు కాల్ చేసి వివరాలు తెలిపాడు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు తెల్లవారుజామున అబ్రార్‌ను గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చారు. అనంతరం తల్లిదండులను పిలిచి వారి సమక్షంలో అబ్రార్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

మహాగణపతి.. గోమయ గణపతి

మట్టి విగ్రహాలను పూజిద్దాం.. భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందిద్దాం అనే గొప్ప సంకల్పంతో కొందరు భక్తులు ఏళ్లుగా మట్టి, గోమయ, పేపర్ వినాయక విగ్రహాలకే జై కొడుతున్నారు. మండపాల్లో ఆ విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణానికి హాని కలగని విధంగా పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ప్రారంభంకానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ విధంగా పూజలు నిర్వహిస్తున్న భక్తులు, పలు మండపాల నిర్వాహకులు, సేవా ట్రస్ట్‌లపై 'సాక్షి' ప్రత్యేక కథనం.


శ్రీమహాలక్ష్మి గణపతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కొలువుదీరనున్న గోమయ గణపతి

- మట్టి, గోమయ విగ్రహాలకే జై కొడుతున్న భక్తులు..
- ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాల నిర్వహణ
- పర్యావరణానికి హాని కలగని విధంగా పూజలు

40 ఏళ్లుగా మట్టి విగ్రహాల పంపిణీ


మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న గోక రామస్వామి

నర్సంపేట: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా నర్సంపేటకు చెందిన వనప్రేమి అవార్డు గ్రహీత గోక రామస్వామి మొక్కల పెంపకంతోపాటు 40 సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేస్తున్నారు. అలాగే, గత సంవత్సరం నుంచి విత్తన గణపతులు తయారు చేస్తున్నారు. ప్రతీ విగ్రహంలో ఒక విత్తనం అమర్చుతున్నారు. తద్వారా నిమజ్జనం అనంతరం విత్తనం మొక్కగా రూపుదిద్దుకుని పెరిగి పండ్లు కాస్తాయని రామస్వామి తెలిపారు. ఈ విషయం తెలిసిన యునెస్కో అసోం ప్రతినిధులు రామస్వామికి శాంతిదూత అవార్డు అందజేసి సన్మానించారు.

2017 నుంచి గోమయ విగ్రహాలకు పూజలు..

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో గల శ్రీ మహాలక్ష్మి గణపతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గోమయ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు 11 రోజులపాటు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ట్రస్ట్ సభ్యులు శ్రీరంగం రాధిక, ఎస్.వి నాగేశ్వర్‌రావు, శ్రీరంగం రాజేశ్వరి, రామారావు, సోమ రజిత, శ్రీనివాస్, సోమ సింధు, రాంబాబు ఏర్పాట్లు చేస్తున్నారు. 2008 నుంచి 2016 వరకు మట్టి విగ్రహాలు, 2017 నుంచి గోమయ వినాయక విగ్రహాలతో ఉత్సవాలు చేస్తున్నారు.

తొమ్మిదేళ్లుగా మట్టి వినాయకుడికి పూజలు


మట్టి వినాయక విగ్రహం

భూపాలపల్లి అర్బన్ : జిల్లా కేంద్రంలోని శ్రీ కన్యకపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏటా మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో తొమ్మిదేళ్లుగా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి ప్రతిమలనే నెలకొల్పుతున్నారు. అంతేకాకుండా జిల్లా కేంద్రంలో ఏటా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం..


మట్టి వినాయకుడికి పూజలు చేస్తున్న న్యూవిజన్ హైస్కూల్ విద్యార్థులు(ఫైల్)

దుగ్గొండి: పర్యావరణ హితం కోరుతూ మండలంలోని గిర్నిబావిలో గల న్యూవిజన్ హైస్కూల్‌లో 15 సంవత్సరాలుగా మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. అలాగే, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మట్టి వినాయకుడిని తయారు చేసి ఏటా వంద విగ్రహాల వరకు గిర్నిబావిలో ఇంటింటికీ అందజేస్తున్నారు.

ఏటూరునాగారంలోని రామాలయంలో మట్టి వినాయకుడికే పూజలు..

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయంలో 6 సంవత్సరాలుగా మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తూ పూజలు నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ వంతు బాధ్యతగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నామని రామాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి కత్తెర శ్రీనివాస్ తెలిపారు.


రామాలయంలో ప్రతిష్ఠించనున్న మట్టి వినాయక విగ్రహం

కాజీపేట-బల్లార్షా మధ్య రైల్వే ఎన్ఐ వర్క్స్

- నాలుగు ప్యాసింజర్ రైళ్లు రద్దు
- నాలుగు రైళ్ల తాత్కాలిక రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని హసన్‌పర్తి–ఉప్పల్–జమ్మికుంట,కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో ప్రీ ఇంటర్‌లాకింగ్ అండ్ నాన్ ఇంటర్‌లాకింగ్ ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వర్క్స్‌తో పలు ప్యాసింజర్ రైళ్లు రద్దు, పలు ప్యాసింజర్ రైళ్లు తాత్కాలిక రద్దు, మరికొన్ని రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత, కొన్ని రైళ్లను రెగ్యులేషన్ చేసి నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ మంగళవారం తెలిపారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు వివరాలు

ఆగస్టు 29వ తేదీన కాజీపేట–సిర్పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17004) ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17036) ప్యాసింజర్, ఆగస్టు 28వ తేదీన కాజీపేట–బల్లార్షా (17035) ప్యాసింజర్లను రద్దు చేయనున్నారు.

తాత్కాలిక రద్దు..

ఆగస్టు 29వ తేదీన భద్రాచలం రోడ్డు–బల్లార్షా (17033) సింగరేణి కాజీపేట–బల్లార్షా మధ్య రద్దు, సిర్పూర్‌టౌన్ –భద్రాచలం రోడ్డు (17034) సింగరేణి సిర్పూర్‌టౌన్ –కాజీపేట మధ్య రద్దు, ఆగస్టు 28వ తేదీన సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (17233) కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ కాజీపేట–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య రద్దు, ఆగస్టు 29వ తేదీన సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను సిర్పూర్ కాగజ్‌నగర్–కాజీపేట మధ్య రద్దు చేసినట్లు తెలిపారు.

తాత్కాలిక హాల్టింగ్ ఎత్తివేత..

ఆగస్టు 29వ తేదీన హైదరాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌కాగజ్‌నగర్–బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (12757) ఎక్స్‌ప్రెస్‌లకు ఉప్పల్, జమ్మికుంట రైల్వే స్టేషన్లలో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేశారు.

రెగ్యులేషన్ ట్రైన్స్..

ఆగస్టు 29వ తేదీన రక్సోల్–చర్లపల్లి (07006) ఎక్స్‌ప్రెస్‌ను 75 నిమిషాలు, లక్నో–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (16094) ఎక్స్‌ప్రెస్‌ను 45 నిమిషాలు, సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (12758) ఎక్స్‌ప్రెస్‌ను 30 నిమిషాల పాటు రెగ్యులేషన్ చేసి నడిపించనున్నట్లు సీపీఆర్వో తెలిపారు.

ఒంటరి మహిళలే టార్గెట్


నిందితుడి అరెస్టు చూపుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్


చోరీ చేసిన బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న సీపీ

- ఆభరణాలు, వాహనాలను చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్
- రూ.23.5 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: రోడ్లపై ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడలో నుంచి చెన్‌స్నాచింగ్‌తోపాటు ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసినట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితుడి నుంచి రూ.23.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మూడు ద్విచక్ర వాహనాలు, రూ.10 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర ప్రాంతానికి చెందిన మంతుర్తి హరీశ్ హైదరాబాద్‌లోని ఓ సిమెంట్ కంపెనీలో క్వాలిటీ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. కాగా, అదే కంపెనీలో పనిచేస్తున్న ఓ ఇంజనీర్ ఇంటిలో బంగారు గొలుసు చోరీ చేసి గోల్డ్‌లోన్ కంపెనీలో తాకట్టు పెట్టాడు. వచ్చిన డబ్బుతో నిందితుడు జల్సాలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సంఘటనలో నిందితుడిని స్థానిక నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. బెయిల్‌పై విడుదలైన నిందితుడిలో ఎలాంటి మార్పు రాలేదు. మళ్లీ చెన్‌స్నాచింగ్‌లకు పాల్పడి వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు సీపీ వివరించారు. నిందితుడు ముందుగా ద్విచక్ర వాహనాన్ని చోరీ చేస్తాడు. దానిపై వెళ్లి చెన్‌స్నాచింగ్‌లకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10 చెన్‌స్నాచింగ్‌లు, మూడు ద్విచక్ర వాహనాలు చోరీ చేశాడని పేర్కొన్నారు.

అప్రమత్తమైన పోలీసులు..

చెన్‌స్నాచింగ్‌లపై అప్రమత్తమైన పోలీసులు పక్కా సమాచారంతో మంగళవారం ఉదయం యాదవ్‌నగర్ క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వస్తున్న నిందితుడు తప్పించుకొని పారిపోగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెన్‌స్నాచింగ్, ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించినట్లు ఆయన తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో హనుమకొండ రెడ్డి కాలనీలోని అద్దె ఇంటిలో పోలీసులు మిగిలిన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వివరించారు.

అధికారులకు అభినందనలు..

నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన క్రైం డీసీపీ గుణశేఖర్, క్రైం ఏసీపీ సదయ్య, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, కేయూ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, రాఘవేందర్, ఏఏఓ సల్మాన్ పాషా, సీసీఎస్ ఎస్సైలు రాజ్‌కుమార్, శివకుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు అంజయ్య, జంపయ్య, కానిస్టేబుళ్లు మధుకర్, చంద్రశేకర్, రాములు, నగేశ్‌ను పోలీస్ కమిషనర్ అభినందించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ..

- రూ. 1.6లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు అపహరణ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఐనవోలు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మండలంలోని వనమాల కనపర్తిలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పులి యాదగిరి, నాగమ్మ దంపతులు ఈ నెల 22వ తేదీన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికెళ్లారు. తిరిగి 25న సాయంత్రం సమయంలో ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. అందులో భద్రపరిచిన 2 తులాల బంగారు గొలుసు, అరతులం ఉంగరం, 20 తులాల వెండి, రూ.10 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి లబోదిబోమన్నారు. సుమారు రూ. 1.6లక్షల విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయని కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.

గణపతి మండపం ఏర్పాటులో అపశ్రుతి..


చికిత్స పొందుతున్న పవన్

నెక్కొండ: గణపతి మండపం ఏర్పాటులో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని నెక్కొండ తండాలో జరిగింది. తండాకు చెందిన బానోత్ పవన్ సెంట్రింగ్ కర్రలను మిషన్ (విద్యుత్ రంపం)తో కట్ చేస్తున్నాడు. ఈ క్రమంలో రంపం అదుపు తప్పి పవన్ ఎడమ చేయికి తగలగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మండప నిర్వాహకులు హుటాహుటినా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పవన్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయని కుటుంబీకులు తెలిపారు.

వినాయక చవితి ఏర్పాట్లలో విషాదం..

- ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడి మృతి
- పాత కంబాలపల్లిలో ఘటన

బయ్యారం: వినాయక చవితి ఏర్పాట్లలో విషాదం నెలకొంది. ట్రాక్టర్‌పై నుంచి పడి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని పాత కంబాలపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలో ప్రతిష్ఠించనున్న వినాయక విగ్రహం తీసుకురావడానికి ముందు ట్రాక్టర్‌ను శుభ్రం చేసేందుకు చాట్ల రాజు(17) అదే గ్రామానికి చెందిన వాసం చరణ్ ట్రాక్టర్‌పై ఏటివద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ బ్రేక్ వేయడంతో రాజు ట్రేలర్ పైనుంచి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రాజును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మంచం పట్టిన బాలికకు చేయూత..

- వైద్యఖర్చుల కోసం రూ.3 లక్షల అందజేసిన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి


మహేశ్‌కు రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్న జగ్గారెడ్డి


మంచంపై దీనంగా ఉన్న సుష్మ

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన చెవ్వగాని మహేశ్ కూతురు సుష్మ అనారోగ్యంతో 9 ఏళ్లుగా మంచం పట్టింది. దీంతో బాలిక కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హైదరాబాద్‌లో ఆ బాలిక తండ్రికి మంగళవారం రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సుష్మ 9 సంవత్సరాల వయసులో దసరా పండుగకు అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడ చీమల మందు కలిసిన చపాతీ తినడంతో తీవ్ర అనారోగ్యానికి గురైంది. అప్పటి నుంచి మంచానికే పరిమితమైంది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో మహేశ్ తన కూతురును ఆస్పత్రుల్లో చూపించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల మహేశ్ తన కూతురి పరిస్థితిని గాంధీభవన్ మీడియాకు తెలుపగా వారు జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన జగ్గారెడ్డి బాలిక తండ్రిని తన ఇంటికి పిలిపించుకుని, రూ.3లక్షల ఆర్థిక సాయం అందించారు. 'నేనున్నా.. అధైర్యపడొద్దు' అని భరోసా బాధిత కుటుంబానికి కల్పించారు. ఆ వెంటనే డాక్టర్ చంద్రశేఖర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వమే వైద్య ఖర్చులను భరించేలా చూస్తానన్నారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వినాయక మండపాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. ప్రతీఒక్కరు విధిగా పనిచేస్తున్న చోటే ఉండాలని ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఇతర శాఖల సమన్వయంతో వాగులు, వంకలు పొంగే ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను గమనిస్తూ ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తూ ఉండాలని, మెన్, మెటీరియల్ సిద్ధంగా ఉంచుకొని, అంతరాయం కలిగిన వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని అన్నారు. మొబైల్ యాప్‌లో వినాయక మండపాల వివరాలు నమోదు చేయాలని వివరించారు. ఎన్ని కిలోవాట్ల లోడ్ వినియోగిస్తున్నారో నమోదు చేయాలని, తద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎంత భారం పడుతుందో తెలుసుకునే అవకాశముంటుందన్నారు. గత ఏడాది దాదాపు 35,000 విగ్రహాలు నమోదయ్యాయని, ఈ ఏడాది 10 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని వివరించారు. విద్యుత్ భద్రతపై ఉత్సవ నిర్వాహకులకు తెలియజేయాలని, సంబంధిత లైన్‌మెన్లు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, ఏఈల నంబర్లు కూడా ఇవ్వాలని సూచించారు. ఎత్తు ఎక్కువగా ఉన్న విగ్రహాల నిమజ్జన రూట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, రోడ్ క్రాసింగ్స్ ఉన్న చోట్ల 11 మీటర్ల స్తంభాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నిమజ్జనం చేసే చెరువులు, కుంటలను కూడా విధిగా పర్యవేక్షించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్వాహకులు వాట్సాప్ గ్రూపుల్లో ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 1912 నంబర్‌కు ఫోన్ చేయాలని నవరాత్రి ఉత్సవ నిర్వాహకులకు సీఎండీ సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్, సీఈలు సదర్‌లాల్, అశోక్, వెంకటరమణ, జీఎం మల్లికార్జున్ పాల్గొన్నారు.

అట్రాసిటి కేసు నమోదు

ఖిలా వరంగల్: కులం పేరుతో దూషించిన అత్తింటి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జన్మభూమి జంక్షన్ రోడ్డుకు చెందిన కన్నెబోయిన మధు ఓ ఒకేషనల్ కళాశాలలో అధ్యాపకుడి పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయాన్ని దాచి పెద్దమ్మగడ్డకు చెందిన నర్సింగ్ విద్యార్థిని అశ్వినిని 2020లో మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకొని ఇద్దరు పిల్లలకు తండ్రి అయ్యాడు. ప్రస్తుతం అశ్విని, ఇద్దరు పిల్లలను శివనగర్‌లో ఉంచి సాకుతున్నాడు. ఇటీవల మధు ఓ మహిళను బైక్‌పై తీసుకెళ్తుండగా అశ్విని చూసింది. ఆ మహిళ ఎవరని ఆమె మధును నిలదీసింది. నీకంటే ముందే పెళ్లి కాగా భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పాడు. నాటి నుంచి భార్యభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఎస్సీ కులం పేరుతో దూషిస్తూ భార్య, ఇద్దరు పిల్లలను వదిలేసి దూరంగా ఉంటున్నాడు. ఇటీవల మొదటి భార్య.. రెండో భార్య అశ్వినిపై దాడి చేసింది. కులంపేరుతో దూషించిన భర్త మధు, అత్త వెంకటమ్మ, ఆడపడుచు సునీత, బావ శివకుమార్‌పై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మంగళవారం వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ తెలిపారు.

కొనసాగుతున్న పంపింగ్


దేవాదుల వద్ద మోటార్లు

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న దేవాదుల జె. చొక్కారావు పంపింగ్ కొనసాగుతోంది. పంపింగ్ కొన్ని రోజుల నుంచి నిలిచింది. ఈ క్రమంలో మంగళవారం పంపింగ్ వద్ద ఉన్న మూడు ఫేజ్‌ల్లోని పది మోటార్లలో ఫేజ్ టులో- 2 , ఫేజ్ త్రీలో 2 మోటార్లను ఆన్ చేసి నీటిని దిగువన ఉన్న గొల్లబెద్దారం రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నారు. నాలుగు మోటార్లతో 831 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పంపింగ్ వద్ద 78.30 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి ఎగువ నుంచి 3,17,480 క్యూసెక్కులు చేరుతుండడంతో 59 గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 77.45 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది

ఈసీజీ టెక్నీషియన్లపై దాడి



ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రిలో ఈసీజీ టెక్నీషియన్లపై రోగితోపాటు ఆమె బంధువులు మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ దేశాయిపేట ప్రాంతానికి చెందిన వివాహిత హారికకు చాతీలో నొప్పి రావడంతో భర్త రాజేశ్, తండ్రి అరుణ్‌తో కలిసి చికిత్స నిమిత్తం ఎంజీఎంలోని క్యాజువాలిటీ విభాగానికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీంతో హారిక ఈసీజీ పరీక్షల కోసం క్యూలో ఉంది. అయితే అత్యవసర పరిస్థితుల్లో ఓ రోగికి ఈసీజీ పరీక్ష నిర్వహించిన టెక్నీషియన్లు మోబిన్, వసంత్‌కుమార్‌పై హారికతోపాటు ఆమె భర్త, తండ్రి దాడికి పాల్పడ్డారు. ఘటనను గుర్తించిన సెక్యూరిటీ సిబ్బందితోపాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని గొడవను సద్దుమణిగించారు. కాగా, ఈఘటనపై తప్పు జరిగిందని హారికతోపాటు రాజేశ్, అరుణ్.. ఈసీజీ టెక్నీషియన్లను వేడుకున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

MEDICAL TRANSCIPTION

- MLT, MPHW(F) చదివిన విద్యార్థులకు DMLT, DMSTలో చదువు + ప్రాక్టికల్ + ఉద్యోగం కలదు. సెల్: 9177631014, 9849819819. [SCA25007614]

REAL ESTATE

TO-LET

- 3-BHK, GopiKrishna Residency Flat No.506, H.No.5-9-11, Flat Rent. Kishanpura, Hanamkonda. Cell: 9959389999, 9390105601. [WA-6763]

WANTED

- మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సెల్: 8247771016, 8247771525. [WA-7580]
- క్రిస్టల్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ L.B నగర్ వరంగల్ యందు పనిచేయుటకు సూపర్‌వైజర్ కావలెను. అర్హత: 10th క్లాస్, జీతం నెలకు 7 వేలు. సంప్ర॥ 9966493673, 9849827928. [SCA25007599]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198 9866574715
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	7702221602
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.